పాఠం 8

# నైజీరియా – ఆఫ్రికాలో ఒక దేశం

నైజీరియా ఆఫ్రికాలో పశ్చిమ వైపున ఉన్న ఒక దేశం. భారతదేశం లాగ నైజీరియా కూడా సుదీర్ఘ పోరాటం ద్వారా బ్రిటిష్ వలస పాలన నుండి స్వాతంత్ర్యం పొందింది. అందుకే నైజీరియా, భారతదేశం సాధారణంగా ఒకేవిధంగా కనబడతాయి. ఆఫ్రికా పటంలో నైజీరియాను గుర్తించి, మన శీతోష్ణస్థితి కూడా అలాగే ఉందేమో చూడండి.

- ఆఫ్రికాపటంలో నైజీరియాను గుర్తించండి. దక్షిణం వైపున గల సముద్రం పేరేమిటి?
- నైజీరియాకు మూడువైపులా ఆనుకొని ఉన్న దేశాల పేర్లు తెలుసుకోండి.
- నైజీరియాలో ఏప్రాంతం భూమధ్య రేఖకు దగ్గరగా ఉంటుంది? ఆ ప్రాంతంలో ఎటువంటి వాతావరణ పరిస్థితులు ఉంటాయి?

**ఋతువులు:**


నైజీరియా దక్షిణ ప్రాంతం భూమధ్య రేఖకు దగ్గరగా ఉంది. దానివల్ల అక్కడ భూమధ్య రేఖా శీతోష్ణస్థితి ఉంటుంది. అంటే సంవత్సరమంతా ఒకే కాలం ఉంటుంది. ఇక్కడ వాతావరణం పొడిగా ఉండి, సంవత్సరమంతా వర్షం కురుస్తుంది. నైజీరియా రాజధాని లాగోస్ ఈ ప్రాంతంలోనే ఉంది. సముద్ర తీరప్రాంతం వెంబడి దట్టమైన అడవులు పెరగడానికి దోహదపడింది. దక్షిణ నైజీరియాలో భూమధ్యరేఖా ప్రాంత శీతోష్ణస్థితి ఉంటుంది. నైజీరియా ఉత్తర భాగంలో చలికాలం తక్కువగా ఉంటుంది. మే నుండి అక్టోబర్ వరకు వర్షాలు కురుస్తాయి. లాగోస్‌లో లాగ సంవత్సరమంతా వర్షం ఉండదు.

- నైజీరియా వర్షపాత పటం చూడండి. లాగోస్, కానో పట్టణాలను గుర్తించండి.
- భూమధ్యరేఖకు ఏ పట్టణం దగ్గరగా ఉంది. ఏది దూరంగా ఉంది?
- నైజీరియాలో ఏ ప్రాంతంలో అధికవర్షాలు కురుస్తాయి?
- ఏ ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం ఉంటుంది?

**సహజ వృక్ష జాలం:**

దక్షిణ నైజీరియాలో ఉన్న సహజ వృక్షజాలం ఉత్తర నైజీరియాలో కనిపించదు. ఈశాన్యంలో పూర్తి చివరన వృక్షాలు అసలే కనబడవు.

పటం-1 : నైజీరియా వర్షపాతం




©SCERT not to be republished




నైజీరియా ఉత్తర ప్రాంతం దాదాపు మొత్తం ఎడారి. ప్రపంచంలోనే చాలాపెద్ద ఎడారి అయిన సహారా ఎడారిలో భాగమిది.

నైజీరియాలో గల సహజ వృక్షజాలాన్ని 2వ పటంలో చూడవచ్చు. వర్షపాత విస్తరణ పటంతో పోల్చి ఈకింది ఖాళీలు పూరించండి:

- ఎక్కువ వర్షపాతం ఉన్నచోట .............. వృక్షజాలం ఉంది.
- మధ్యరకం వర్షపాతం ఉన్నచోట .............. వృక్షజాలం ఉంది..
- తక్కువ వర్షపాతం ఉన్నచోట .............. వృక్షజాలం ఉంది.
- ఎడారి ప్రాంతాల్లో ................. వృక్షజాలం ఉంది.

**మడ అడవులు (Mangrove Forests):**


నైజీరియా తీరప్రాంతం సముద్రమట్టానికి ఎక్కువ ఎత్తుగా లేదు. సముద్ర అలలు పెద్ద ఎత్తున వచ్చినప్పుడు సముద్ర జలాలు తీరప్రాంతాలను, డెల్టాప్రాంతాలను ముంచివేస్తాయి. అలలు తగ్గినప్పుడు నీరు తగ్గుతుంది. దాంతో తీరప్రాంతం ఉప్పునీటితో బురదమయమవుతుంది. మడ అనే చెట్లు ఇక్కడ చాలా పెరుగుతాయి.

చిత్రం–8.2 చూడండి. మడ చెట్ల వేళ్లు బురదనీటిలో ఎలా అతుక్కుపోతాయో గమనించండి. అవి ఎన్నో రకాలుగా ఉపయోగపడతాయి. అవి సముద్రపు అలలను నిరోధిస్తాయి. బురద నీటిలో మడ చెట్ల వేళ్లు మునిగి ఉంటాయి. వేళ్లు శ్వాసతీసుకోడానికి అవి దోహదపడతాయి. బురదనేలలో ఆక్సిజన్ అంతగా ఉండదు. మట్టి వదులుగా ఉన్న భూమిలో గట్టిగా నిలబడడానికి ఈ వేళ్లు దోహదపడతాయి. మడవృక్షాలు ఉప్పు నేలల్లో పెరుగుతూ ఉప్పునీటితో కూడిన బురదనేల విస్తరించకుండా




© SCERT not to be republished

పటం-2 నైజీరియా సహజ వృక్షజాలం




చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తాయి. మడచెట్లది గట్టికలప. దృఢమైనది. వీటి పండ్లు తియ్యగా ఉంటాయి. నైజీరియా తీరప్రాంతంలో 16 నుండి 96 కి.మీ. వెడల్పులో మడ అడవులు ఉన్నాయి.

భారతదేశపు తీరప్రాంతాలలో కూడా మడవనాలు ఉన్నాయి. గంగానది డెల్టా (పశ్చిమ బెంగాల్) దగ్గర మడవనాలు ముఖ్యమైనవి. మడవృక్షాలు విశిష్టలక్షణాలు గలవి.

**భూమధ్యరేఖాప్రాంతపు అడవులు:**

ఉప్పునీరు, బురదప్రాంతాల చివరినుండి దట్టమైన అడవులు మొదలవుతాయి. ఈ అడవులలో ఎత్తయిన చెట్లు, పాకే తీగలు, మహాగని, ఎబోని, రబ్బర్, సాపిలి, ఒబేచి, ఆఫ్రికా వాల్‌నట్, ఆయిల్‌పామ్ మొదలయిన చెట్లు ఉన్నాయి. పొడి వాతావరణం లేనందువల్ల ఇక్కడి చెట్లు సంవత్సరం పొడవునా ఆకులతో ఉంటాయి. రఫియా పామ్ ఆయిల్‌చెట్ల నుండి వంటనూనెలను తీస్తారు. ఈ ప్రాంతంలో అనేక కొబ్బరి చెట్లు ఉన్నాయి. మడవృక్షాల తరవాత ఇవి 80 నుండి 160 కి.మీ. విస్తరించి ఉన్నాయి.

- మన రాష్ట్రంలో వీటిలో ఏ చెట్లు పెరుగుతున్నాయి?

వీటిలో కొన్ని చెట్లు 60మీ ఎత్తు వరకు పెరుగుతాయి. (పటం-2). వీటికి సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఏమంటే - వీటి కలప వివిధ రంగులలో ఉంటుంది. ఉదా: ఎబోని కలప నలుపురంగులో, మహాగని ఎరుపు, గోధుమరంగులో, ఒబేచి తెలుపు రంగులో ఉంటాయి. దీనికి భిన్నంగా మన దేశంలో చెట్లు గోధుమరంగు కలపను ఇస్తాయి.

భూమధ్యరేఖా ప్రాంతపు అడవులు ఉత్తరదిశగా ఋతుపవన అడవులతో కలుస్తున్నాయి. ఈ ప్రాంతాలలో పొడివాతావరణంవల్ల చెట్లు ఆకులను రాలుస్తాయి. మళ్ళీ మే లేదా జూన్ నెలలో వర్షాలు పడటంతో ఈ అడవులలో చెట్లు చిగురిస్తాయి.

నైజీరియా కలపకు గట్టితనం ఉండటంవల్ల ప్రపంచ దేశాలలో, ముఖ్యంగా యూరప్‌లో, ఈ కలపకు చాలా గిరాకీ ఉంది. ఇది వరకు ఈ కలపతో ఓడలు, పడవలు తయారుచేసేవారు. రైలు పట్టాలకింది స్లీపర్స్ (దుంగ)గా కూడా ఈ కలపను వాడేవారు. నైజీరియా ఈ కలపను ఎగుమతిచేసి ఎక్కువ మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. క్రమేణా ఇది అటవీ సంపద తరుగుదలకు దారి తీసింది.

**సవాన్నా:**

ఇప్పటివరకు తీరానికి దగ్గరలోని దక్షిణ నైజీరియా ప్రాంతాన్ని గురించి తెలుసుకొన్నాం. మనం లోపలివైపుకి వెళితే, వర్షపాతం తగ్గుతుంది. ఇక్కడ పెరిగే చెట్లసంఖ్య తక్కువ; వాటి మధ్య దూరం ఎక్కువ. మధ్యలో ఎత్తుగా గడ్డి పెరుగుతుంది. ఇక్కడ పెరిగే ముఖ్యమైన చెట్లు అకాషియా, బోబాబ్ మొదలయినవి (పటం-2). ఇవి పొడవుగా పెరగవు. ఇదే సవాన్నా ప్రాంతం. తేమ ఎక్కువగా ఉండే నైజర్, బెనూ నదుల మధ్య ప్రాంతంలో చెట్లు దగ్గరదగ్గరగా పెరుగుతాయి.

సవాన్నా ప్రాంతంలో చెట్లు తక్కువగా, గడ్డి ఎక్కువగా ఎందుకు ఉన్నాయి? చెట్లకు ఎక్కువ నీరు అవసరం. ఈ ప్రాంతంలో గడ్డి తక్కువ నీటితో పెరుగుతుంది.

© SCERT not to be republished

వర్షాకాలంలో గడ్డి తొందరగా పెరుగుతుంది. తరువాతకాలంలో అంతే తొందరగా ఎండిపోతుంది. మళ్లీ వర్షాకాలంలో కొత్త గడ్డి మొలుస్తుంది.

ఉష్ణసవాన్నా ప్రాంతంలో గడ్డి పొడిగా, గట్టిగా ఉంటుంది. ఈ గడ్డి ఇరాన్, పోలండ్, ఫ్రాన్స్ వంటి శీతల ప్రాంతాల గడ్డిలాగ మెత్తగా ఉండదు. అందువల్ల కొన్ని రకాల జంతువులు తప్ప ఇక్కడ పెద్దగా జంతుజాలం లేదు.

ఉత్తరదిశగా వెళితే వర్షపాతం తగ్గుతూ వృక్షసంపదలో మార్పులు వస్తాయి. మొక్కలు, గడ్డి మరింత చిన్నవిగా అవుతాయి. మొక్కలు విచిత్రంగా గొడుగులా విస్తరిస్తాయి.

మీరు గ్వాలియర్‌గాని, రాజస్థాన్‌గాని సందర్శించినట్లయితే, చిన్న ముళ్లచెట్లు, పొదలు, వీటిమధ్య గడ్డిని గుర్తించవచ్చు. ఈ ప్రాంతంలో వర్షపాతం తక్కువ కాబట్టి ఇలా అవుతుంది.

**నైజీరియా సహజప్రాంతాలు:**

నైజీరియాలో పెద్ద పర్వతాలు లేవు. కాని చిన్న కొండప్రాంతాలు ఉన్నాయి.

3వ పటం చూడండి. మీరు చదివినంతవరకు నైజీరియాలోని విభిన్న ప్రాంతాలను గుర్తించండి.

**1. నైజర్ డెల్టా:** ఈ ప్రాంతంలో నైజర్‌నది చిన్న చిన్న సెలయేర్లుగా, ప్రవాహాలుగా విడివడి సముద్రంలో కలుస్తుంది. తమ ఓడలను నిలపడానికి యూరోపియన్లు అనేక ఓడరేవులను నిర్మించారు. ఇక్కడినుండే అమెరికాకు బానిసలను పంపేవారు. తరవాతి కాలంలో ఇక్కడినుండి కలప, ఇతర ఉత్పత్తులను బయటి దేశాలకు పంపేవారు.

- తరగతి గదిలో ఆఫ్రికాపటం వేలాడదీసి నైజర్ నది పుట్టిన ప్రాంతాన్ని గుర్తించండి. ఈ నీరు ఏ సముద్రంలో కలుస్తుంది?
- భారతదేశంలో అతిపెద్ద డెల్టా ఏ నదికి ఉంది?
- డెల్టాలో వ్యవసాయం చేయడానికి గల సమస్యలు ఏమిటి?


**2. తీరమైదానాలు:** డెల్టా అంతటా నైజీరియా తీరమైదానాలు విస్తరించి ఉన్నాయి. ఈ మైదానాలు దాదాపు 120 మీ. ఎత్తున ఉన్నాయి.

- ఈ ఎత్తును దేని ఆధారంగా కొలుస్తారు?

**3, 4 నదీలోయలు, పీఠభూములు:** మీరు తీరప్రాంతాల నుండి ఉత్తర దిశకు వెళ్లినట్లయితే 300 మీ. ఎత్తుగల యొరుబా, ఉడి వంటి కొద్దిపాటివాలుగల పీఠభూములను చేరుకోవచ్చు. వాలు ప్రాంతం నుండి కిందికి దిగితే నైజర్, బెనూ అనే నదులను చేరుకోవచ్చు. ఇరుకైన ఈ నదీలోయలను దాటి ముందుకు వెళితే లోపలికి వాలుగల జోస్ పీఠభూములను చేరుకోవచ్చు. 1200 మీ. ఎత్తైన ఈ పీఠభూమి నైజీరియాలో అన్నిటికంటె ఎత్తైనది. ఈశాన్యదిశగా కిందికి దిగినట్లయితే చాడ్ సరస్సును చేరుకోవచ్చు. ఇది చాలా విశాలమైనది. కొంతభాగం మాత్రమే నైజీరియాలో ఉండి సరస్సు మిగతా ప్రాంతమంతా చాడ్ దేశంలో ఉన్నందువల్ల ఆ ప్రాంతానికి చాడ్ దేశమనే పేరువచ్చింది.

- నైజీరియాలోని నాలుగు ముఖ్యమైన సహజ ప్రాంతాల పేర్లను తెలపండి.

*పటం-3 : నైజీరియా భౌతిక లక్షణాలు*




© SCERT not to be republished

### ప్రజలు:

నైజీరియాలో ఇబో(Ibo), యొరుబా, ఫులాని, హౌస వంటి వివిధ జాతుల ప్రజలు నివసిస్తున్నారు.

నైజీరియా తెగలలో ఎక్కువమంది చిన్న గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయం చేస్తారు. ఒక ఊరిలోవారందరూ ఏదోఒకరకంగా బంధుత్వం కలిగి ఉంటారు. ఈ మధ్యకాలంలో యువకులు ఎక్కువగా పట్టణాలకు వలస వెళుతూ కర్మాగారాలలో, కార్యాలయాలలో కొత్త ఉద్యోగాలు చేస్తున్నారు.

### వ్యవసాయం:

ఇక్కడి ప్రజల ఆహారంలో పెండలం (యామ్), కర్రపెండలం, మొక్కజొన్నలు, వరి అన్నం, బీన్స్ ఉంటాయి. కర్రపెండలం అనేది చిలగడ దుంప వంటి తియ్యటి ఆహారపదార్థం.

గిరిజనులు ప్రతి సంవత్సరం కొంత అటవీ ప్రాంతాన్ని వ్యవసాయ భూమిగా మారుస్తారు. అన్ని కుటుంబాలు ఆ అటవీ భూమిని సమానంగా పంచుకుంటాయి. పంట కోయడానికీ, ఇతర సమయాలలోనూ వారు తరచుగా ఒకరికొకరు సహాయం చేసుకుంటారు.

not to be republished




*చిత్రం 8.3*

*a) కోలా గింజలు అమ్మే వ్యక్తి b) సాంప్రదాయికపు మొక్కజొన్న నిల్వ పద్ధతి c) కర్రపెండలం అమ్మే వ్యక్తి d) కోకో చెట్టు, పండ్లు*









నైజీరియాలో రైతులు వారి కుటుంబ అవసరాలకు సరిపడేటంత మాత్రమే వ్యవసాయం చేస్తారు. పారతో నేలను సిద్ధం చేస్తారు. ఎద్దులతో లేదా గుర్రాలతో చాలా అరుదుగా దున్నుతారు. అక్కడ ఉత్పత్తి పరిమితంగా ఉంటుంది. మారుతున్న కాలం దృష్ట్యా అక్కడి ప్రజలు ఈ మధ్య మార్కెట్‌కోసం అధిక ఉత్పత్తి చేస్తున్నారు. పొడిప్రాంతాలలో అధికంగా పత్తి పండిస్తూ ఫ్యాక్టరీలకు పంపుతున్నారు.

**దక్షిణ నైజీరియాలో పంటలు:**

మీకు చాక్లెట్లు తినడమంటే ఇష్టమే కదా? వాటిని నైజీరియాలో పండే కోకోతో తయారుచేస్తారు. దక్షిణ నైజీరియాలో కోకో మాత్రమే కాకుండా రబ్బరు తోటలు ఉన్నాయి. పామ్ ఆయిల్ చెట్లుకూడా ఎక్కువగా పెంచుతారు. వీటి గింజలనుండి నూనె తీస్తారు. పడవలో నైజర్ నదిని దాటి పామ్‌ఆయిల్ పండ్లను, గింజలను సేకరిస్తారు. పూర్వం అడవులలోనే పామ్ ఆయిల్ చెట్లు పెంచేవారు. డిమాండ్ పెరగడంతో అటవీ ప్రాంతాలలో వీటి ఉత్పత్తి పెరిగింది. నైజీరియానుండి కోకో, రబ్బరు, పామ్ ఆయిల్ ఎగుమతి చేసి విదేశీ మారకద్రవ్యాన్ని పొందుతున్నారు.

- నైజీరియాలో ఈ పంటలను పండించే ప్రాంతాలను పటం-4లో గుర్తించండి.

బ్రిటిష్‌వారు తోటలు పెంచడం మొదలుపెట్టారు. అడవులనుండి వచ్చే ఉత్పత్తితో బ్రిటిష్‌వారు సంతృప్తిపడేవారు కారు. వారు ఎక్కువ ఉత్పత్తి చేసి ఎగుమతి చేసేవారు.

తోటలు వారికి అనేక పనులను సులభం చేశాయి. మొదటగా వారు అడవులకు వెళ్లి పామ్ ఆయిల్ చెట్లను గుర్తించాల్సిన అవసరం ఉండేది కాదు. చెట్లు అన్నీ ఒక్కచోటనే పెంచినందువల్ల వాటిని కాపాడటం, పంట కోయడం సులభమయింది. వ్యాపారానికి అవసరమైన ఉత్పత్తి బాగా పెరిగింది. నైజీరియా ప్రజలు ఈ తోటలలో పనిచేయడం ప్రారంభించారు. బ్రిటిష్‌వారు ఈ తోటలకు మేనేజర్లుగా ఉండేవారు.

ఈ విధంగా నైజీరియాలో పామ్ ఆయిల్ చెట్లు, కోకో, రబ్బరు వంటి వాణిజ్య వ్యవసాయం మొదలైంది.

ఇది మాత్రమే కాకుండా, తోటలుగల ప్రాంతంలో అనేకమైన ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటుచేశారు. వీటిలో కోకో పండ్లనుంచి గింజతీయడం, వీటిని ఎండబెట్టడం, పామ్‌చెట్ల పండ్లనుంచి నూనెను తీయడం, చెట్లనుంచి రబ్బరు తీయడం వంటివి ముఖ్యమైనవి.

వీటినుండి వచ్చే లాభాన్ని ఎక్కువగా బ్రిటిష్‌వారు పొందేవారు. నైజీరియా ప్రజలు కేవలం వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారు. భారత దేశంలో బ్రిటిష్ వారి కాలంలో వ్యాపారం కోసమే టీ, కాఫీ తోటలు ప్రారంభమైనాయి. 1960 వరకు నైజీరియా బ్రిటిష్ వారి అధీనంలో ఉండి, స్వాతంత్ర్యం పొందినది. ఆ తరవాత క్రమంగా ఈ తోటలకు సంబంధించిన వ్యాపారం నైజీరియా ప్రజల అధీనంలోకి రావడంతో వారు ప్రయోజనం పొందుతున్నారు.

**వ్యవసాయం, పశుపోషణ (ఉత్తర నైజీరియా):**

ఉత్తర నైజీరియాలో సవాన్నా గడ్డి భూములున్నాయని మీకు తెలుసు. ఇక్కడ వర్షపాతం తక్కువ. గడ్డి జాతులు, కొన్ని ముండ్లజాతి చెట్లు కనిపిస్తాయి. ఫులాని (Fulani) తెగవారికి పశుపోషణ ప్రధానవృత్తి. వీరు గొర్రెలు, మేకలు పెంచుతారు. తోళ్ల (గొర్రెలవి, మేకలవి) ఉత్పత్తులు ఇక్కడ ముఖ్యమైన వ్యాపారం.

ఉత్తర నైజీరియాలో తక్కువ వర్షపాతంతో పండే పంటలను మాత్రమే పండిస్తారు. జొన్నలు, మొక్కజొన్న, కర్రపెండలం వంటి ఆహారపు పంటలు ఎక్కువగా పండిస్తారు. కొన్ని ప్రాంతాలలో గోధుమలు కూడా పండిస్తారు. ఇక్కడ చెట్లను నరికివేయరు. పంటపొలం మధ్యలో కూడా చెట్లు కనిపిస్తాయి.

- దక్షిణ నైజీరియాలోని అధిక వర్షపాతం గల ప్రాంతంలో పండే పంటలను, ఉత్తర నైజీరియాలో తక్కువ వర్షపాతంగల ప్రాంతంలో పండే పంటలను పట్టిక రూపంలో రాయండి.



© SCERT not to be republished



*చిత్రం-8.4 సాంప్రదాయిక దుస్తులమీద వేసే "కంపాలా" అనే డిజైను*

ఈ ప్రాంతాలలో కోలానట్స్, వేరుశనగ, పొగాకు, పత్తి వంటి వాణిజ్య పంటలు పండిస్తారు. నైజీరియా ప్రజలకు కోలానట్స్ అతి ముఖ్యమైనవి. అతిథులు వచ్చినప్పుడు దీన్ని ప్రత్యేక ఆహారంగా ఇస్తారు. మీరు కోలా పానీయాలు తాగిఉంటారు. కోలా ఉత్పత్తులలో కోలానట్స్ ఎక్కువగా వాడతారు. అందువల్ల కోలానట్స్ ఎక్కువగా ఎగుమతి చేస్తారు.

ఉత్తర నైజీరియాలో ఎంతో కాలంనుండి పత్తి పండిస్తున్నారు. అక్కడి ప్రజలు చేతిమగ్గాలమీద బట్టలు నేసి వ్యాపారం చేస్తారు. పత్తి పండే ప్రాంతాల సమీపంలో రైలుమార్గాల నిర్మాణం చేసి రవాణాను సులభం చేస్తున్నారు. ఇప్పుడు అక్కడ వస్త్రపరిశ్రమ కూడా ఏర్పాటు అయింది.

ఉత్తర నైజీరియాలో వేరుశనగ అధికంగా పండిస్తారు. ఇక్కడి నేల, శీతోష్ణస్థితి అనుకూలంగా ఉండటంతో బ్రిటిష్‌వారు ఈ పంటను ఇక్కడ ప్రారంభించారు. వేరుశనగ నూనె తీసే ఫ్యాక్టరీలను కానోలోను, కడునా (Kaduna)లోను నెలకొల్పారు.

- పటంలో పత్తి, వేరుశనగ పండే ప్రాంతాలను గుర్తించండి.

**ఖనిజతైలాలు:**

- నైజీరియా సహజ వనరులలో చమురు అతి ప్రధానమైనది. పటంలో నైజీరియాలోని చమురు లభించే ప్రాంతాలను గుర్తించండి. ఈ చమురును, ఎగుమతిచేసే ఓడరేవుల పేర్లను తెలపండి.

1958 నుండి నైజీరియాలో చమురు ఎగుమతి చేస్తున్నారు. చమురుశుద్ధి కర్మాగారాలు హార్‌కోర్ట్‌లోను (Harcourt), వారిపోర్ట్‌లోను (Vari-port) నెలకొల్పారు. మధ్య నైజీరియాలోని 'కడునా' నగరంలో అలాంటి ఒక ఫ్యాక్టరీ నెలకొల్పారు.

ఈ పరిశ్రమ దాదాపు విదేశీ కంపెనీల చేతిలో ఉంది. నైజీరియా ప్రభుత్వానికి ఉన్న వాటా చాలా తక్కువ. నైజీరియాలో లభించే ఇతర ఖనిజాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.


- పటం చూసి నైజీరియాలో లభించే ఖనిజాల జాబితా రాసి అవి లభించే ప్రాంతాలను గుర్తించండి.

నైజీరియాలో సహజ వనరులు, వ్యవసాయం చాలా ఎక్కువ. కాని వారు వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోతున్నారు. అంతేగాకుండా ఈ వనరులు ఎక్కువగా విదేశీ కంపెనీల ఆధీనంలో ఉన్నాయి. ప్రస్తుతం నైజీరియా ప్రజలు నెమ్మదిగా పరిశ్రమలను స్థాపిస్తున్నారు.



*చిత్రం-8.5 లాగోస్ నగరం-ఒక దృశ్యం*

© SCERT not to be republished




*పటం-4 : పంటలు - సహజ వనరులు*

© SCERT not to be republished

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) నైజీరియా ప్రజలకు భూమధ్యరేఖాప్రాంతపు అడవులు ఎలా ఉపయోగపడుతున్నాయి?

2) దక్షిణ నైజీరియాలోని మూడు వాణిజ్య పంటల పేర్లను తెలపండి.

3) నైజీరియా రైతులు తమ ఆహారంకోసం పండించే కనీసం నాలుగు పంటల పేర్లను రాయండి.

4) ఉత్తర నైజీరియాలోని కొన్ని తెగలవారు పశుపోషణను ఎందుకు చేపట్టారు? వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?

5) దక్షిణంనుండి ఉత్తర నైజీరియా వైపు వెళ్లేటప్పుడు ఈ కింది అంశాలలో మీరుగమనించే తేడాలు ఏమిటి?

ఎ) నేల (Terrain)

బి) వర్షపాతం

సి) వృక్షసంపద

6) ఈ దిగువ పట్టికను పరిశీలించి ఉత్తర, దక్షిణ నైజీరియా ప్రజల వృత్తులను వేరువేరుగా తెలపండి.

| వృత్తులు | ఉత్తర నైజీరియా | దక్షిణ నైజీరియా |
|---|---|---|
| 1. బొగ్గు తవ్వకం | | |
| 2. తగరపు తవ్వకం | | |
| 3. ముడిచమురు వెలికితీయడం | | |
| 4. పశుపోషణ | | |
| 5. రబ్బరు మొక్కల పెంపకం | | |
| 6. పామ్ ఆయిల్ చెట్ల పెంపకం | | |
| 7. వేరుశనగ పండించడం | | |
| 8. పత్తి పండించడం | | |
| 9. సరుకులు నింపడం, దించడం | | |
| 10. వేరుశనగ నూనె తీయడం | | |
| 11. పామ్ ఆయిల్ తీయడం | | |
| 12. కోకో పండించడం | | |
| 13. పెండలం, కర్రపెండలం పండించడం | | |
| 14. కోలానట్ పండించడం | | |

7) యొరుబా పీఠభూమి, జోస్‌పీఠభూముల ఎత్తులు ఎంత?

8) ఇటీవలి కాలం వరకు నైజీరియా భారతదేశంలాగా బ్రిటిష్ వలస ప్రాంతం. రెండు దేశాల మధ్య ఏమైనా పోలికలున్నాయా?

9) నైజీరియాలోని సంప్రదాయ దుస్తులమీద వేసే కంపాలా డిజైన్ బాగుందా? ఎందుకు?

10) ఈ పాఠంలోని 'సహజ వృక్షజాలం' శీర్షిక కింద గల పేరాలను చదివి మీ అభిప్రాయం తెలపండి.

© SCERT not to be republished